
సంపుటి :02 సంచిక :174 పేజీలు :06
వెల ₹5
అక్షర దర్బార్
Voice of the people
www.aksharadarbar.com
మంగళవారం 02, సెప్టెంబర్ 2025



# వైద్య సేవలకు ప్రత్యేక ప్రణాళిక

- రాష్ట్ర మంత్రులు రాజనర్సింహ, పొంగులేటి, కొండా సురేఖ
- మహబూబాబాద్ లో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజీ ప్రారంభం

04



# రెక్క విప్పిన కరెప్షన్!

సర్వం.. సకలం.. అవినీతి మయం

వారంతా ప్రభుత్వ అధికారులు.. లంచావతారం ఎత్తిన డబ్బు పిశాచులు.. ప్రభుత్వం నెలనెలా టంచనుగా జీతం ఇస్తున్నా జనాల రక్తం తాగే జలగలు.. పైసా పైసాకు ఎదుటి మనిషిపై ఆధార పడి జీవించే పరాన్నజీవులు.. సిగ్గూ శరం లేకుండా లంచాలు తినడం మరిగిన తిమింగలాలు.. సర్కార్ తలపై ఎన్ని అప్పులు ఉన్నా, కోట్లకు కోట్లు తీసుకున్న అప్పులకు మిత్తీలు కట్టుకుంటూ జీతాలు ఇస్తున్నా.. ప్రజలకు ఉచితంగా పనిచేసి పెట్టాలనే సోయి మరచిన మనసులేని రాతి బొమ్మలు.. చం తీసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా వరుసగా సర్కార్ ఉద్యోగులు పట్టుబడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్లు అక్రమంగా సంపాదించి, చివరకు ఏసీబీకి పట్టుబడుతున్నారు. తాజాగా ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు నివాసంలో రూ.5 కోట్ల విలువైన నగదు, ఆభరణాలు, ఇతర సామగ్రి పట్టుబడటం సంచలనం సృష్టించింది. అవినీతి అధికారుల్లో ఎక్కువ మంది రెవెన్యూశాఖకు చెందిన వారే ఉన్నారు. ఇంకా ఏసీబీకి చిక్కని చేపలెన్నున్నాయన్నది అంతులేని ప్రశ్న!

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

- పైసా లేనిదే ఆ సార్లు పైసా పని చేయరు..
- ప్రతి పనికి ఒక ధర.. వారి రూటే సెప'రేటు'
- 8 నెలల్లో 167 మంది పట్టుబడ్డారు..
- ఏసీబీవోళ్లు రూ.44 కోట్లకు పైగా సొమ్ము సీజ్ చేశారు..
- తాజాగా సంచలనం సృష్టించిన ఖిలావరంగల్ తహసీల్దారు కేసు
- పెద్దమొత్తంలో సొమ్ము బయటపడుతుందనుకుంటే కొంతే సీజ్
- ఏసీబీ దాడులపై స్థానికంగా అనుమానాలు

05

ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు

# సిఫారసు

కాళేశ్వరంపై సర్కార్ కీలక నిర్ణయం

04



# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

04



# కవితపై బీఆర్ఎస్ అధినేత వేటు

- పార్టీ సస్పెన్షన్ విధిస్తూ నిర్ణయం
- లిక్కర్ కేసులో జైలు జీవితం గడిపినప్పటి నుంచి కవిత అలక
- తన గురించి పట్టించుకోలేదని రెబల్ అవతారం
- సొంత సంస్థ జాగృతి బలోపేతంపై ఫోకస్
- బీఆర్ఎస్ పై అనేకసార్లు విమర్శలు

02



# కాంగ్రెస్ పతనం షురూ!



మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

05

# గంజాయి ముఠా గుట్టురట్టు




- 7.6 క్వింటాళ్ల సరుకు పట్టివేత.. విలువ రూ.3.81 కోట్లు
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

04

# కాంగ్రెస్ కు రోజులు దగ్గరపడ్డాయి

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



అక్షరదర్బార్, నల్లబెల్లి : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ రోజులు దగ్గరపడ్డాయని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నల్లబెల్లి మండలం లెంకలపల్లి గ్రామ పరిధిలోని అనుములపల్లెకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన, రెండుళ్లే కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో కొత్త రోడ్డు పనులు ప్రారంభించలేదని, రైతులకు సమయానికి యూరియా ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా బకాయిలు, అసంపూర్ణ రుణమాఫీ తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బొందపెడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కవితపై వేటు



- పార్టీ సస్పెన్షన్ విధిస్తూ బీఆర్ఎస్ అధినేత నిర్ణయం
- లిక్కర్ కేసులో జైలు జీవితం గడిపినప్పటి నుంచి కవిత అలక
- తన గురించి పట్టించుకోలేదని రెబల్ అవతారం
- సొంత సంస్థ జాగృతి బలోపేతంపై ఫోకస్
- బీఆర్ఎస్ పై అనేకసార్లు విమర్శలు

అక్షరదర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నదన్న సంచలన అభియోగాల నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ మంగళవారం తన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. గత ఏడాది ఆగస్టులో ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలుకు వెళ్లొచ్చాక కవిత కొంతకాలం పాటు వ్యక్తిగత జీవితంపై ఫోకస్ పెట్టారు. తన సొంత సంస్థ జాగృతిని బలోపేతం చేసే పనిలో పడ్డారు. తాను జైలు జీవితం గడుపుతున్నప్పుడు తన గురించి బీఆర్ఎస్ ఏమాత్రం పట్టించుకోలేదని ఆమె అలక వహించినట్లు వార్తలు వచ్చాయి. పార్టీ ఆవిర్భావ వేడుకలపై విమర్శలతో బహిరంగ లేఖ రాయడం మే నెలలో కలకలం రేపింది. పార్టీ రజతోత్సవ సభలో పార్టీ అధినేత ప్రసంగంపై కేడర్ అసంతృప్తిగా ఉందంటూ.. కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. ఈ క్రమంలోనే కేసీఆర్ దేవుడేకానీ చుట్టూ దెయ్యాలు ఉన్నాయి అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. తన తండ్రికి రాసిన లేఖను కొందరు ఉద్దేశపూర్వకంగానే బయటపెట్టారంటూ మండిపడ్డారు. పార్టీ అంతర్గత విషయాలు బయట చర్చించడం మంచిదికాదన్న సోదరుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేయాల్సిన పనులు చేయాలి... కేవలం ట్వీట్లకే పరిమితం అయితే ఎలా? అని మే 29వ తేదీన జరిగిన మీడియా చిట్‌చాట్‌లో వ్యాఖ్యానించారు. ఆపై రెండు రోజులుగా కొత్తగా తెలంగాణ జాగృతి కొత్త కార్యాలయాన్ని బంజారాహిల్స్‌లో ప్రారంభించారు. ఈ ఏడాది కేటీఆర్ చేతికి కవిత రాఖీ కూడా కట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు విచారణ నోటీసులు ఇవ్వడంపై నిరసనగా.. జూన్ 10వ తేదీన ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించారామె. అయితే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పూర్తిగా దూరంగా ఉంది. జూన్ 16వ తేదీన.. ఫార్ములా ఈకార్ రేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ ముందు విచారణకు హాజరైతే.. అదేరోజు అదేంపట్టనట్లు జగిత్యాలలో ఆమె పర్యటించారు. జూలైలో.. జహీరాబాద్‌లో జరిగిన బీసీ రిజర్వేషన్ల సభలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్న కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దానికి ఆమె వార్నింగ్ ఇచ్చారు. అంతేకాదు మండలి చైర్మన్‌కు ఆమె మల్లన్నపై చర్యలు తీసుకోవాలంటూ లేఖ కూడా రాశారు. అయితే ఇంత జరిగినా.. బీఆర్ఎస్ ఈ వ్యవహారానికి దూరంగా ఉంది. పార్టీతో సంబంధం లేకుండా బీసీ రిజర్వేషన్ల సాధనా దీక్ష చేపట్టారు. జై బీసీ.. జై జాగృతి నినాదాలు చేశారు. గత నెల 5న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై నల్లగొండలో బీఆర్ఎస్‌ను నాశనం చేసిన లిల్లీపుట్ నేత అని వ్యాఖ్యానించడం తీవ్ర కలకలం రేపింది. తాజాగా కాళేశ్వరం అవినీతి వెనుక హరీశ్‌రావు, సంతోశ్‌రావు వల్లే కేసీఆర్‌కు అవినీతి మరక అంటిందంటూ సంచలన ఆరోపణలు చేశారు. తన తండ్రిపై సీబీఐ ఎంక్వైరీనా?అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాట్లాడారు. ఇలా వరుస షాకులిస్తున్నా.. తనపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఆమె విమర్శలకు మరింత పదును పెట్టారని కొందరు విశ్లేషకులు, తాను కావాలనే అలాంటి వైఖరి అనుసరించి, పార్టీ తనను సస్పెండ్ చేసేలా చేసుకున్నారని మరికొందరు భావిస్తున్నారు. ఇప్పుడు కవిత కొత్త పార్టీ ఏమైనా స్థాపిస్తారా? లేదంటే కాంగ్రెస్ లేదా బీజేపీలో చేరతారా? అనేది రాష్ట్రంలో చర్చనీయాంశమైంది.

# యూరియా కోసం రైతుల అరిగోస

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాలలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి లైన్లలో నిలబడి కూడా ఎరువు దొరకక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి యూరియా కీలకమవడంతో తమ పంటలను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు విక్రయ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు సేవా సమితి వద్ద పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరి నిలిచారు. ఒక్క లారీ యూరియానే రావడంతో రైతులు అధిక సంఖ్యలో చేరడంతో అక్కడ గందరగోళం నెలకొంది. వ్యవసాయ పనులు మానుకుని కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నామని, సరిపడా యూరియాను వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. గత పది ఏళ్లలో ఎరువుల కొరత ఎదురుకాలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మళ్లీ రైతులు రోజులు తరబడి తిరగాల్సిన దుస్థితి నెలకొన్నదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



# వృద్ధాశ్రమం స్థల పరిశీలన



అక్షరదర్బార్, కాజీపేట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ, జిల్లా సంక్షేమ అధికారి సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం స్థాపనకు కాజీపేట మండలం సోమిడి గ్రామం వద్ద ప్రభుత్వం 20 గుంటల భూమిని కేటాయించింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో జిల్లా కలెక్టర్ భూమిని ఈ భూమిని కేటాయించారు. ఈ స్థలాన్ని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి విజయచందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, బిల్ల రమణారెడ్డి, కాజీపేట తహసీల్దార్ బావ్ సింగ్, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, డీసీపీవో ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ఎంతో అవసరమైన వృద్ధాశ్రమం ఇక్కడ త్వరలోనే హనుమకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నెలకొల్పబడుతుందని తెలిపారు.

# బీఎన్ కేఎస్ కమిటీ ఎన్నిక

## - అధ్యక్షుడిగా గూడబోయిన రాజు



అక్షరదర్బార్, నడికూడ: హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఏర్పడింది. మంగళవారం ఈ కమిటీ కార్యవర్గం ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షునిగా గూడబోయిన రాజు, ఉపాధ్యక్షునిగా ప్లంబర్ స్వామి, కోశాధికారిగా పొనగంటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా సామాజి సాంబయ్య, కార్యదర్శిగా జి విజేందర్, సలహాదారులుగా కే భద్రయ్య, జి తిరుపతి, కె కుమారస్వామి, జి సాంబయ్య, మంగ శ్రీను, గూడబోయిన రవికుమార్, కె చిరంజీవి, పి రాజేందర్ ఎన్నికయ్యారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## - వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, వర్ధన్నపేట: ప్రజలు అందించే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వర్ధన్నపేట పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన మంగళవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకు పోలీస్ స్టేషన్ చేరుకున్న సీపీకి పోలీస్ అధికారులు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ, డీసీలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీ మాట్లాడుతూ ప్రజలకు నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో పాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. తనిఖీల అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐలు సాయిబాబు, రాజు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా ఉంటా

## మాజీ ఎమ్మెల్యే చల్లా



అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం వరికోలు, నార్లపూర్, చర్లపల్లి గ్రామాలలో ఇటీవల మృతిచెందిన కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రజల సుఖదుఃఖాల్లో ఎల్లప్పుడూ తమతో ఉంటామని హామీ ఇచ్చారు.

# పరకాలలో గణపతి నవరాత్రుల సందడి

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని 15వ వార్డులో వినాయక నవరాత్రుల వేడుకలు సందడిగా కొనసాగుతున్నాయి. మంగళవారం మాజీ కౌన్సిలర్ చందుపట్ల సుజాత సాయి తిరుపతి రెడ్డి హిందూ వాహిని సీపీఐ గల్లి, రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గజానన మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తరువాత రజకవాడలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో కూడా భాగమయ్యారు. ప్రజలు ఆరోగ్య సౌఖ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.





# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, చిట్యాల: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సోమవారం చిట్యాల ఆదర్శ పాఠశాల, కళాశాల, వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గ్రౌండ్లో వర్షపు నీరు నిలుస్తోందని విద్యార్థులు తెలియజేయగా, తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వసతి గృహంలో గీజర్, దోబీ ఘాట్ అవసరమని విద్యార్థులు కోరగా, సంబంధిత శాఖ అధికారిని ఫోన్ చేసి వెంటనే ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యే, భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల్లో విద్య, భోజన నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. మెస్,



కాస్మోటిక్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.



# అలియాబాద్ లో హోమం

## భక్తులకు అన్నదానం

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం అలియాబాద్ గ్రామంలో గణపతి నవరాత్రుల సందర్భంగా బొడ్రాయి గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. శాతరాశి సనత్‌కుమార్ పటేల్ పర్యవేక్షణలో వేదపండితుడు రాఘవేంద్ర శర్మ హోమకార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ కార్యక్రమమైనా గ్రామంలో కలసికట్టుగా నిర్వహించడం తమ సంప్రదాయమని స్థానికులు తెలిపారు. ఈ వేడుకలో జంగిలి శ్రీరాములు, శ్రీనివాస రావు, మురళి, కటకం సంజీవరావు, కమటం రంగారావు, జంగిలి నర్సింగారావు, అంబరగొండ రాజేష్, శివ చరణ్, పవన్, అఖిల్, అజయ్, రుత్విక్ తదితరులు పాల్గొన్నారు.



# సాంస్కృతిక ఉద్యమాల ద్వారానే మార్పు సాధ్యం

అక్షర దర్బార్, వరంగల్ : పాశ్చాత్య విష సంస్కృతిని విడనాడి సాంస్కృతిక ఉద్యమాల ద్వారానే సమాజ మార్పు సాధ్యమని ఐక్య ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు మైదంశెట్టి రమేష్ అన్నారు. మంగళవారం వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో చిర్రా రాజేష్ కన్నా అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న దౌర్జన్యాలపై ప్రజా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి ముందుండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కొత్త జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తకొండ రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా చిర్రా రాజేష్ కన్నా, ఉపాధ్యక్షులుగా మంద రవి, సహాయ కార్యదర్శులుగా దాసారపు అనిల్, గూడ సురేష్, జగపతి, కోశాధికారిగా హంసా రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా నీల రవీందర్, అప్పదాసు అశోక్, గుర్రం రవి, సుహాసిని, జను యుగేందర్, సునీల్ తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పెద్దారపు రమేష్, మాలోతు సాగర్, సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సమరయోధులకు బీజేపీ శ్రద్ధాంజలి

అక్షర దర్బార్, పరకాల : పరకాల అమరవీరుల మైదానం అమరధామంలో స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, పరకాల నియోజకవర్గ కాంటెస్టెంట్ డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా నిజాం పాలనలో రజాకర్ల అణచివేత కొనసాగిందని, పరకాలలో అమరవీరులు ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. రంగాపురంలో ప్రజలను



చెట్లకు కట్టి కాల్చివేసిన ఘోర సంఘటనను ప్రస్తావించారు. అమరుల సాహసగాథలను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, భవిష్యత్ తరాలకు చరిత్రను అందించాలన్నారు. కార్యక్రమంలో కాచం గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణరావు, దేవునూరి మేఘనాథ్, సంగా పురుషోత్తం, కాసగాని రాజ్‌కుమార్, బెజ్జంకి పూర్ణచారి, దగ్గు విజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కు ఘన నివాళి

అక్షర దర్బార్, పరకాల: పరకాల టౌన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిన్నల గోనాథ్, ఒంటేరు రామ్మూర్తి, పోరండ్ల



సంతోష్, మడికొండ సంపత్, మెరుగు శ్రీశైలం గౌడ్, పసుల రమేష్, దుబాస్ వెంకటస్వామి, పాడి ప్రతాప్ రెడ్డి, సదానందం గౌడ్, బొచ్చు బాబు, నల్లల అనిల్, ఒంటేరు శ్రావణ్ కుమార్, పాలకుర్తి శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.



# హన్మకొండ హైవే దిగ్బంధం

## కౌకొండ అభివృద్ధే - అఖిలపక్ష లక్ష్యం

అక్షర దర్బార్, పరకాల : కౌకొండ గ్రామానికి మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు మంగళవారం పరకాల అంబాల హైవే వెల్లంపల్లి క్రాస్ రోడ్డుపై శాంతియుత నిరసన చేశారు. ధర్మ సమాజ్ పార్టీ, బీజేపీ, బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ – 2023లో ప్రారంభించిన రోడ్డు పనులు కంకర వేసిన దశలోనే ఆగిపోయాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఒక వారంలో రోడ్డు పనులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్షకు దిగుతామని అఖిలపక్షం హెచ్చరించింది. కార్యక్రమంలో ఇనుగాల దిలీప్, తోట రాజయ్య, మేకల విష్ణు, చుక్క సూర్యం, మేకల కోమాల, గోల్కొండ నిఖిల్, ముక్కెర రాకేష్, అల్లే లింగయ్య, జన్నారపు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

### అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య

అక్షర దర్బార్, చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రైతులు, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు జన్నే యుగేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లయ్య మాట్లాడుతూ, భూభారతిలో రెండు నెలల క్రితమే దరఖాస్తులు సమర్పించినా ఇప్పటివరకు పరిష్కారం లేకపోవడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వంలో సాదా బైనామా పేరుతో రైతులు, ప్రజలకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా అదే విధంగా సమస్యలు సాగదీస్తున్నారని ఆయన విమర్శించారు. అసైన్మెంట్ భూములు సహా అన్ని దరఖాస్తులను పట్టాలుగా మంజూరు చేయాలని కోరిన ఆయన, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం మాజీ మండల అధ్యక్షుడు బొడ్డు ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఎన్ డీఎస్ ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు సిఫారసు

### - కాళేశ్వరంపై సర్కార్ కీలక నిర్ణయం

అక్షరదర్బార్, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ గుర్తించిందని.. ప్రణాళిక, డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. అందుకే ఈ అంశంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ కూడా విచారణ జరిపి లోపాలను గుర్తించిందని తెలిపింది. ఎన్డీఎస్ఏ నివేదికపై అసెంబ్లీలో చర్చించామని లేఖలో ప్రభుత్వం ప్రస్తావించింది. మరోవైపు రాష్ట్రానికి సీబీఐ రాకుండా గతంలో ఉన్న ఆదేశాలను సడలిస్తూ జీవో విడుదల చేసింది. సీబీఐ విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

# అమర వీరుల ఆశయాలు కొనసాగించాలి

### నాన్ పొలిటికల్ జేఏసీ

అక్షర దర్బార్, పరకాల: స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో తెలంగాణ సాయుధ ఉద్యమానికి ప్రత్యేక గుర్తింపు ఉందని నాన్ పొలిటికల్ జేఏసి అధ్యక్షులు డా. సిరికొండ శ్రీనివాస చారి అన్నారు. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పలు ఉద్యమ సంఘాలు, రచయితల సంఘాలు అమరవీరులకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించాయి. అనంతరం సభలో మాట్లాడుతూ శ్రీనివాస చారి, సీనియర్ జర్నలిస్టు రేపాల నర్సింహ రాములు – పరకాల ఊచకోత చరిత్రలో మరో జలియన్‌వాలాబాగ్ ఘట్టంగా నిలిచిపోయిందని, 78 ఏళ్ల క్రితం అమరులైన యోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి, ఎడ్ల సుధాకర్, బూచి ప్రభాకర్ రెడ్డి, రేగూరి రాఘవ రెడ్డి, పాపిరెడ్డి, జగతి పాల్గొన్నారు.

# కేజీబీవీలో స్పెషలాఫీసర్ తనిఖీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం కొరికిశాల కస్తూర్బా పాఠశాలను మండల స్పెషలాఫీసర్ మానస మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

# చిట్యాల పోలీస్ స్టేషన్ లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ..



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్‌లో నేడు వార్షిక తనిఖీ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, స్టేషన్ పరిసరాలను సమగ్రంగా పరిశీలించి, సిబ్బందిని వివిధ అంశాలపై మార్గనిర్దేశం చేశారు. తనిఖీలో భాగంగా స్టేషన్ రికార్డులు – కేసుల రిజిస్టర్లు, ఎఫ్ఐఆర్ పుస్తకాలు, సీజ్ రికార్డులు, గస్తీ పుస్తకాలు, స్టేషన్ డైరీ మరియు ఇతర పత్రాలను సవివరంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తు వేగంగా, పారదర్శకంగా జరగాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిర్మించిన రిసెప్షన్ రూంను ప్రారంభించారు. ప్రజలు సులభంగా ఫిర్యాదులు నమోదు చేసుకునే విధంగా, స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించేలా రిసెప్షన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. తదుపరి స్టేషన్ ప్రాంగణంలో వనమహోత్సవం,కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నాటి మొక్కలను సంరక్షించడం కూడా బాధ్యతగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ.సంపత్ రావు,సీఐ. డి మల్లేష్, ఎస్ఐ శ్రావణ్ కుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.




# గంజాయి ముఠా గుట్టురట్టు

- 7.6 క్వింటాళ్ల సరుకు పట్టివేత..
- విలువ రూ.3.81 కోట్లు
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. సుమారు రూ.3.8 కోట్లకు పైగా విలువ చేసే 763.845 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ కంట్రోల్ టీమ్, ఖానాపూర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ వివరాల ప్రకారం.. ఖానాపురం మండలంలోని చిలుకలగుట్ట ప్రాంతంలో కొందరు వ్యక్తులు బరువైన సంచులను గుట్టపై నుంచి దించుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో డ్రగ్ కంట్రోల్ టీమ్, ఖానాపూర్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నలుగురు వ్యక్తులు నాలుగు గంజాయి సంచులతో కనిపించగా, వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులను సూర్యాపేట జిల్లాకు చెందిన భూక్య సాయికుమార్, ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అందాల పాండు రెడ్డి, ఒడిశాకు చెందిన గుల్లారి మునిరాజ్, కొప్పు కోటయ్యగా గుర్తించారు. వీరు మజ్జి కృష్ణ అనే వ్యక్తి ఆదేశాల మేరకు వీరు ఒడిశా నుంచి గంజాయిని రవాణా చేస్తున్నారని సీపీ తెలిపారు. ఆగస్టు 28న వీరు ఒక ట్రాలీలో గంజాయిని తరలిస్తూ వరంగల్ వైపు వస్తుండగా, హైవేపై పోలీసుల తనిఖీలు ఎక్కువైనందున గంగారం మీదుగా వచ్చారు. పోలీసులకు పట్టుబడతామని భావించి, వారు ట్రాలీని వెనక్కి తిప్పుకుని గంజాయిని ఒక గుట్టపై దాచిపెట్టారు. మళ్లీ సోమవారం ఆ గంజాయిని తరలించేందుకు సాయికుమార్‌తో కలిసి రాగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి మొదట నాలుగు గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. మరింత విచారించగా, గుట్టపై ఇంకా 19 సంచులు దాచిపెట్టినట్లు చెప్పారు. పంచనామా నిర్వహించి మొత్తం 23 గంజాయి సంచులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి బరువు 763.845 కిలోలు, విలువ రూ. 3,81,92, 250 ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఆపరేషన్‌లో కీలకపాత్ర పోషించిన స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్, ఆర్ఐ శివాకేశవులును సీపీ అభినందించారు.

# వైద్య సేవలకు ప్రత్యేక ప్రణాళిక

- రాష్ట్ర మంత్రులు రాజనర్సింహ, పొంగులేటి, కొండా సురేఖ
- మహబూబాబాద్ లో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజీ ప్రారంభం



అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజీ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, అధికారులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో రూ.186 కోట్ల వ్యయంతో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజ్, 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, బాలికలు, బాలుర హాస్టల్ ప్రారంభించి, మూడవ సంవత్సరం చదువుతున్న దమయంతి, స్వాతి, ప్రకాష్ పాండే, మైదేహి వర్మ, అనీషా, యతేశం, తదితర వైద్య విద్యార్థిని, విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆదివాసి ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టిందని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలు, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలు నిర్మించి ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించడం కోసం నిబద్ధతతో ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా కేంద్రంలో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం కోసం ప్రత్యేక కార్యచరణ ద్వారా క్షేత్రస్థాయిలో ఆసుపత్రులు, విద్యాసంస్థల అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతుందని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ బలోపేతానికి పదోన్నతులు కల్పించి అవసరం ఉన్న మౌలిక వసతులను ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తామని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యం బాగుగా ఉంటేనే ఏదైనా చేయగలమని, అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని వైద్యశాఖ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వైద్య,నర్సింగ్ కళాశాలు నిర్మించి మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా అభివృద్ధికి సహకరించాలని మంత్రులను కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, అనిల్ కుమార్, డీఎంఈ డాక్టర్ కె నరేంద్ర కుమార్, ఎన్ఎంసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విమల తమస్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లకావత్ వెంకట్, ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పతనం

# ప్రారంభమైంది

**- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

అక్షరదర్బార్, దామెర: రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం దామెర మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పండుగ శ్రీనివాస్, పండుగ సమత (వార్డ్ మెంబర్), మోర్తాల బాబురావు, గోల్కొండ స్వామి, గోల్కొండ నరేష్ లతో పాటు మరికొంత మంది ఆ పార్టీకి రాజీనామా చేస్తూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, అందుకే ఆ పార్టీ నుండి బీఆర్ఎస్ లో చేరుతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలతో కాంగ్రెస్ పతనం ప్రారంభం అవుతుందన్నారు. ప్రజలంతా మళ్ళీ బీఆర్ఎస్ కు మద్దతు తెలపడానికి సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గులాబి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ ఎండి జాకీర్ అలీ, మాజీ సర్పంచి పున్నం సంపత్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోనగాని రాజు, కార్యదర్శి పంచగిరి రాజుకుమార్, నాయకులు పున్నం రమేష్, ఇటుకల బాబురావు, ఇటుకల చిన్న రాజు, శ్రీధర్, గోల్కొండ సారంగం, మోర్తాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.





# రెక్క విప్పిన కరెప్షన్!

- పైసా లేనిదే ఆ సార్లు పైసా పని చేయరు..
- ప్రతి పనికి ఒక ధర.. వారి రూటే సెప'రేటు'
- 8 నెలల్లో 167 మంది పట్టుబడ్డారు..
- ఏసీబీవోళ్లు రూ.44 కోట్లకు పైగా సొమ్ము సీజ్ చేశారు..
- తాజాగా సంచలనం సృష్టించిన ఖిలావరంగల్ తహసీల్దారు కేసు
- పెద్దమొత్తంలో సొమ్ము బయటపడుతుందనుకుంటే కొంతే సీజ్
- ఏసీబీ దాడులపై స్థానికంగా అనుమానాలు

**వారంతా ప్రభుత్వ అధికారులు.. లంచావతారం ఎత్తిన డబ్బు పిశాచులు.. ప్రభుత్వం నెలనెలా టంచనుగా జీతం ఇస్తున్నా జనాల రక్తం తాగే జలగలు.. పైసా పైసాకు ఎదుటి మనిషిపై ఆధారపడి జీవించే పరాన్నజీవులు.. సిగ్గూ శరం లేకుండా లంచాలు తినడం మరిగిన తిమింగలాలు.. సర్కార్ తలపై ఎన్ని అప్పులు ఉన్నా, కోట్లకు కోట్లు తీసుకున్న అప్పలకు మిత్తీలు కట్టుకుంటూ జీతాలు ఇస్తున్నా.. ప్రజలకు ఉచితంగా పనిచేసి పెట్టాలనే సోయి మరచిన మనసులేని రాతి బొమ్మలు.. చం తీసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా వరుసగా సర్కార్ ఉద్యోగులు పట్టుబడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్లు అక్రమంగా సంపాదించి, చివరకు ఏసీబీకి పట్టుబడుతున్నారు. తాజాగా ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు నివాసంలో రూ.5 కోట్ల విలువైన నగదు, ఆభరణాలు, ఇతర సామగ్రి పట్టుబడటం సంచలనం సృష్టించింది. అవినీతి అధికారుల్లో ఎక్కువ మంది రెవెన్యూశాఖకు చెందిన వారే ఉన్నారు. ఇంకా ఏసీబీకి చిక్కని చేపలెన్నున్నాయన్నది అంతులేని ప్రశ్న!**



## సర్వం.. సకలం.. అవినీతిమయం

**అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి**

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జరిపిన దాడుల్లో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ దాడుల్లో తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్‌లు, రవాణా శాఖ అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, అటవీ, వ్యవసాయ శాఖ అధికారులతో సహా వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు. వీరంతా తమ అధికార దుర్వినియోగం చేస్తూ, సాధారణ ప్రజల నుంచి లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇదే కోవలో తాజాగా వరంగల్ జిల్లా పరిధిలోని ఫోర్ట్ వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు ఆదాయానికి మించిన ఆస్తులతో పట్టబడటం ఉమ్మడి జిల్లాలో సంచలనం సృష్టంచింది. దాడుల్లో రూ. 1.15 కోట్ల విలువైన ఏడు స్థిరాస్తులు, రూ. 1.42 లక్షల విలువైన 17 ఎకరాల భూమి, 10 గుంటల వ్యవసాయ భూమి, రూ. 23.84 లక్షల విలువైన 70 తులాల బంగారు ఆభరణాలు, రూ. 92,000 విలువైన 1.791 గ్రాముల వెండి వస్తువులు, రూ. 34.78 లక్షల విలువైన రెండు ఫోర్–వీలర్లు, ఒక టూ–వీలర్, రూ. 3.28 లక్షల విలువైన 23 గడియారాలు, రూ. 16.43 లక్షల విలువైన ఇతర గృహోపకరణాలు పట్టుకున్నారు. వీటన్నింటి విలువ సుమారు రూ. 5.02 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు. మార్కెట్ విలువ ప్రస్తుత ప్రభుత్వ విలువ అంతకంటే, ఎక్కువగా కూడా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా తహసీల్దార్ బండి నాగేశ్వరరావును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి, స్పెషల్ జడ్జ్ ముందు హాజరుపరిచారు.

### - దూకుడు పెంచిన ఏసీబీ..

అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. గడిచిన ఎనిమిది నెలల్లో 179 కేసులు నమోదు చేసి అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పటివరకు 167 మంది ప్రభుత్వ ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్ పట్టించింది. ఆయా కేసుల్లో మొత్తం రూ.44.30 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసింది. గత నెలలో ఏసీబీ 31 కేసులు నమోదు చేసింది. 22 మంది ప్రభుత్వ ఉద్యోగులు, నలుగురు ప్రైవేట్ ఉద్యోగులను అరెస్ట్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీకి పూర్తి స్వతంత్రత ఇచ్చింది. అవినీతి అధికారులు ఏ శాఖలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా.. ఉపేక్షించొద్దని తేల్చిచెప్పింది. ఫిర్యాదులు రాగానే వెంటనే రంగంలోకి దిగాలని ఆదేశించింది. దీంతో లంచాల విషయం తెలిస్తే తమకు సమాచారం అందించాలంటూ టోల్ఫ్రీ నంబర్ ను, వాట్సాప్పనంబర్ ను జనంలోకి విస్తృతంగా ఏసీబీ అధికారులు తీసుకెళ్తున్నారు. బాధితుల నుంచి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఆ ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి, లంచగొండులకు చెక్పెడ్తున్నారు. అక్రమాస్తులు ఉన్న ఆఫీసర్లనూ గుర్తిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఉన్నతాధికారుల ఇండ్లలో ఇటీవల తనిఖీలు చేసి, వందల కోట్లు విలువ చేసే ఆస్తులను ఏసీబీ సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రతి నెలా సగటున 20 మంది అవినీతి అధికారులు పట్టుబడుతున్నారు. సగటున నెలకు 20 కేసులు రికార్డవుతుండగా.. 20 మంది అరెస్టవుతున్నారు. ఈ ఎనిమిది నెలల్లో పట్టుబడిన అధికారుల్లో 20 మందికి పైగా మహిళా అధికారులు ఉన్నారు. మరికొంత మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఏసీబీ నమోదు చేసిన కేసులు, పట్టుబడిన అధికారుల లెక్కల ప్రకారం.. అవినీతిలో మొదటి స్థానంలో రెవెన్యూ శాఖ, రెండో స్థానంలో పోలీస్ శాఖ, మూడో స్థానంలో మున్సిపల్ శాఖ ఉన్నాయి.

### - కొంత సొమ్మే సీజ్ తో అనుమానాలు..

**తహసీల్దారు పట్టుబడటంతో ఉమ్మడి జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగతా రెవెన్యూ అధికారుల గుండెల్లోనూ రైళ్లు పరిగెత్తాయి. ఇక తమ వంతు కూడా వస్తుందేమోనని కొందరు ఇప్పటికీ తేలు కుట్టిన దొంగల్లా నక్కి నక్కి ఉంటున్నారు. ఇది ఒకవైపు అయితే.. మరోవైపు తహసీల్దారు బండి నాగేశ్వరరావు అక్రమాస్తులు కేవలం రూ.5.02 కోట్లు మాత్రమే పట్టుబడటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు తహసీల్దారుపై వచ్చిన ఆరోపణల ప్రకారం.. ఆయన అక్రమాస్తులు పెద్దమొత్తంలో ఉంటాయని స్థానికులు అంచనా వేశారు. తీరా రూ.5.02 కోట్ల ఆస్తులే పట్టుబడినట్లు వార్తలు వెలువడటంతో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లయిందనే టాక్ తెరపైకి వచ్చింది. ఏమి జరిగి ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా నివురు గప్పిన నిప్పులా సదరు అధికారిపై అవినీతి ఆరోపణలు ఉండగా, వాటిని పటాపంచలు చేస్తూ.. ఏసీబీ అధికారులు అక్రమ లెక్కలు తేల్చారు. ఏకకాలంలో పలుచోట్ల దాడులు నిర్వహించి అక్రమాస్తులు, భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ తహసీల్దారు ఇళ్లలో దాడులు నిర్వహించడంతో, ఇలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్లు, రెవెన్యూ అధికారుల గుండెల్లో గుబులు పుట్టింది.**

### - ఇటీవల పట్టుబడిన లంచావతరాలు..

**ర ంగారెడ్డి జిల్లాలో తహసీల్దార్ చింతకింది లలిత, సర్వేయర్ కోట రవి భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో టైపోగ్రాఫికల్ తప్పులను సరిదిద్దేందుకు రూ.50,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ రాజేశ్కుమార్ ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఒక రూ.లక్ష డిమాండ్ చేసి, రూ.70,000 లంచం తీసుకుంటూ ఈయన ఏసీబీకి దొరికాడు. ఆదిలాబాద్ జిల్లాలో జాయింట్ సబ్-రిజిస్ట్రార్ శ్రీనివాస్ రెడ్డి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం రూ.5,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. నిజామాబాద్ జిల్లాలో మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ గుర్రం వివేకానంద రెడ్డి తన డ్రైవర్ నెల్లి తిరుపతి డ్రైవర్ సాయంతో వాహన రిజిస్ట్రేషన్, లైసెన్స్ రెన్యూవల్ వంటి సేవలకు రూ. 25,000 లంచం తీసుకుంటుండగా పట్టబడ్డాడు. సిద్దిపేట జిల్లా ఇంజినీరింగ్ కన్సల్టెంట్ బండికింది పరుశురాములు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఫైళ్లను ఉన్నతాధికారులకు పంపించేందుకు రూ.11,500 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. జగిత్యాల జిల్లాలో జిల్లా రవాణాశాఖ అధికారి బానోత్ భద్రు నాయక్ ఇటీవల ఫిర్యాదుదారు వాహనం సీజ్ చేయకుండా, అతని మొబైల్ ఫోన్లు విడుదల చేయడానికి రూ.22,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏడీప ఉల్లోజు నర్సింహారావు ఎరువుల అమ్మకాలకు సంబంధించి దుకాణదారుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండటానికి రూ.25,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. కరీంనగర్ జిల్లాలో పంచాయత్ సెక్రటరీ నాగరాజు ఫిర్యాదుదారుడికి కొత్తగా నిర్మించుకున్న ఇంటికి సంబంధించిన హౌస్ నబరు కేటాయించడానికి రూ.20,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. సూర్యాపేట జిల్లాలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనంతుల వెంకన్న ఫిర్యాదుదారుడి కలప వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేయడానికి రూ.20,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. పట్టుబడిన అధికారులంతా ప్రస్తుతం చెరసాలలో ఉన్నారు. న్యాయస్థానం వారి కేసుల్లో విచారణ జరుపుతున్నది. ప్రజల నుంచి లంచం డిమాండ్ చేసే ప్రభుత్వ అధికారుల గురించి సమాచారం ఇవ్వడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫోన్ చేయవచ్చని ఏసీబీ అధికారులు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వారు హామీ ఇస్తున్నారు.**




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915